# భక్తి - శరణాగతి

శ్రీపుట్టపర్తి నిలయుడు
కాపాడును మిమ్ము నెపుడు కరుణాకరుడై
చేపట్టి మిమ్ము బ్రోచును
ఏ పట్టున విడువకుండ ఏలును మిమ్మున్.

చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంత రహితు డనాది వాడు
తాను పుట్టక చావక చంపబడక
అంతటను సర్వ సాక్షియై యలరు నట్టి
ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మయగును.

భారతదేశము వేదాల పట్టుకొమ్మ
యజ్ఞ యాగాది క్రతువుల కాటపట్టు
పెక్కు అవతారములు గన్న పెద్ద తల్లి
నీతి నియమాల రూపు ఈ త్యాగభూమి.

ప్రేమ స్వరూపులారా! భారతదేశము నీతి, నియమాలకు పుట్టినిల్లు; సత్య, ధర్మాలకు మెట్టినిల్లు. ఇట్టి భరతభూమియందు పుట్టిన మీ జన్మ మహా అదృష్టవంతమైనది. ఇది పుణ్యభూమి, తపోభూమి, త్యాగభూమి. దీనిని భోగభూమిగా మార్చుకొనుటకు ప్రయత్నించకండి. నడుము వంచి, చెమటోడ్చి, కండలు కరిగించి కష్టపడి పనిచేయండి. భరతభూమికి ముద్దు బిడ్డలైన మీరు మొద్దు బిడ్డలుగా, చెడ్డ బిడ్డలుగా మారకూడదు; ఉత్తమ బిడ్డలుగా, ఆదర్శ బిడ్డలుగా జీవించాలి. అప్పుడే మిమ్మల్ని కన్నందుకు భరతమాత ఎంతైనా ఆనందిస్తుంది. మీకు ఏ డిగ్రీలు లేకపోయినా ఫరవాలేదు. "మేము భరతమాత బిడ్డలము" అన్నదే మీకున్న పెద్ద క్వాలిఫికేషన్. భారతదేశము భాగ్యభూమి. ఎట్టి భాగ్యము? ఆధ్యాత్మిక భాగ్యము, ఆనంద

sri sathyasaivachanamrutam

భాగ్యము, త్యాగభాగ్యము. కనుక, భరతభూమియందు పుట్టిన ప్రతివ్యక్తి త్యాగమును, ఆధ్యాత్మిక తత్త్వమును అభివృద్ధిపర్చుకోవాలి. సేవయే తన కర్తవ్యమని విశ్వసించాలి. Service is God. సేవద్వారా దైవాన్ని దర్శించాలి.

అనేకమంది "దేవుడెక్కడున్నాడు?" అని ప్రశ్నిస్తారు. అలాంటివారికి ఏమని జవాబు చెప్పాలి?

"ఇందు గలడందులేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూసిన
అందందె గలడు......"

అని ధైర్యంగా చెప్పాలి. భగవంతుడు లేడన్నవారికి లేడు, ఉన్నాడన్నవారికి ఉన్నాడు.

'నో' అనువారికి 'నో' అనురా
'ఎస్' అనువారికి 'ఎస్' అనురా
'నో', 'ఎస్' లు మీ నోటికెగాని
సాయికి సర్వం 'ఎస్, ఎస్,ఎస్'

దేవుడు లేడని వాదించేవారికి మీరు చెప్పవలసిన సమాధానమేమిటి? "అయ్యా, నీ దేవుడు నీకు లేకపోవచ్చు. కాని నా దేవుడు నాకున్నాడు. నా దేవుడు లేడని చెప్పటానికి నీకు అధికారం లేదు" అని వారికి బుద్ధి చెప్పాలి. ఎలాంటి పరిస్థితిలోనైనా మీరు అవిశ్వాసానికి చోటివ్వరాదు. ధైర్యసాహసాలతో సమాజధర్మాన్ని, ప్రాచీన సంస్కృతిని నిలబెట్టటానికి కంకణం కట్టుకోవాలి. భగవంతుడు మూడు ప్రతిజ్ఞలు చేశాడు – "సంభవామి యుగే యుగే" (ధర్మ సంస్థాపనార్థం నేను ప్రతి యుగమునందును అవతరిస్తాను) "యోగ క్షేమం వహామ్యహం (అనన్యభక్తితో నన్ను ఉపాసించిన వారి యోగక్షేమాలను చూసుకుంటాను), మోక్ష యిష్యామి మాశుచః" (నన్ను శరణుజొచ్చినవారికి మోక్షం ప్రసాదిస్తాను). భగవంతుని బిడ్డలైన మీరుకూడా మూడు ప్రతిజ్ఞలు చేయాలి – దైవం ఉన్నాడనే అచంచల విశ్వాసాన్ని కల్గియుంటామనేది మొదటిది, దైవాన్ని చూడగల్గుతామనేది రెండవది, దైవంతో ఏకం అవుతామనేది మూడవది.

srisatyasaivachanamrutam

## దోషం దృష్టిలో ఉంది, సృష్టిలో లేదు

ఈ రెండువేల సంవత్సరం చాల చెడు ఫలితాలనిస్తుందని అనేకమంది అంటున్నారు. కాని చెడు అన్నది జగత్తులో లేనేలేదు. ఆ చెడుయందుకూడా మంచి ఉన్నది. సర్వమూ భగవత్సంకల్పమునుండి పుట్టినదే. భగవత్సృష్టియందు చెడు ఏవిధంగా రాగలదు! భగవత్సంకల్పము చెడ్డదైతేకదా, మీకు చెడ్డకాలము రావటానికి. భగవత్సంకల్పము ఎల్లప్పుడు మంచిదే. సర్వత్ర భగవంతుడే వ్యాపించియున్నాడు. కనుక మంచి, చెడ్డలు మీ దృష్టి యందున్నవి గాని, సృష్టియందు లేవు. మీకు ఏదైనా చెడ్డదిగా తోచిందంటే, అది మీ దృష్టిదోషమేగాని, భగవంతుని సృష్టిదోషం కాదు. బాధలను లెక్కచేయక వాటిని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగినప్పుడే మానవత్వం ధన్యమౌతుంది.

ఎలాంటి పరిస్థితిలోనైనా మీరు ధర్మాచరణకు వెనుకంజ వేయకూడదు. ప్రాణానికి ప్రమాదం కల్గినప్పటికీ సిద్ధంగా ఉండాలి. జీవితంలో చావు ఒక తూరే వస్తుందిగాని, రెండుతూర్లు రాదు కదా! ఏనాటికైనా చావక తప్పదు. కనుక, ప్రాణాలకు తెగించి ధర్మాన్ని రక్షించాలి. మీరు సృష్టింపబడింది మీకోసం కాదు; దైవం కోసమే మీరు సృష్టింపబడ్డారు దైవ సంకల్పము చేత సృష్టింప బడ్డ మీరు దైవాజ్ఞను శిరసావహించి మీ జన్మను సార్థకం గావించుకోవాలి. దైవాన్ని ధృఢంగా విశ్వసించాలి. ఎవరు అడ్డు తగిలినా లెక్కచేయకూడదు. మంచికే అనేక కష్టములు అడ్డుతగులుతుంటాయి. ఎలాంటి కష్టము ఎదురైనప్పటికీ అది మీ మంచికోసమే అని విశ్వసించాలి. పిల్లలు పరీక్షలలో అప్పుడప్పుడు ఫెయిల్ అవుతుంటారు. అయితే, ఫెయిలయ్యామని వదలిపెడతారా? లేదే! రెండవతూరి శ్రద్ధగా చదివి ఉత్తీర్ణులవుతారు. "న సుఖాల్లభ్యతే సుఖం" సుఖమునుండి సుఖాన్ని పొందడానికి వీలుకాదు. కష్టము నుండియే సుఖాన్ని అనుభవించవచ్చు. చీకటి లేకుండిన వెలుగుకు విలువలేదు. అట్లే కష్టము లేక సుఖమునకు విలువలేదు. కాబట్టి, కష్టసుఖములు మానవునికి సహజమని మీరు భావించాలి.

ఒకానొక సమయంలో కుంతీదేవి తనకు జీవితమంతా కష్టాలనే ప్రసాదించమని కృష్ణుణ్ణి ప్రార్థించింది. "కృష్ణా! కష్టాల్లోనే నిన్ను స్మరించటానికి వీలవుతుంది. పాండురాజు జీవించియున్నప్పుడు, సుఖసంతోషాలను అనుభవిస్తున్నప్పుడు నేను ఏనాడూ నిన్ను స్మరించలేదు. పాండురాజు గతించిన తరువాత కష్టసమయమందే నిన్ను అనేక పర్యాయములు

sri sathyasai vachanamrutam

స్మరిస్తూ వచ్చాను. కాబట్టి, కష్టములే నాకు మంచివనిపిస్తోంది. నేను ఎన్ని కష్టములనైనా అనుభవించటానికి సిద్ధమే. కాని, నీ ప్రేమ మాత్రం కించిత్తైనా చలించకూడదు. నిన్ను మరువని భక్తిని, కష్టాలను అనుభవించే శక్తిని నాకు ప్రసాదించు" అని కోరింది. ఆమె తన ప్రాణమంతా కృష్ణునిపైనే పెట్టుకొంది. పాండవులు అనుభవించిన కష్టాలు ఎవ్వరూ అనుభవించలేదు. కనుకనే వారు నిరంతరము దైవసన్నిధిలో నిలువగల్గారు.

### నిజమైన భక్తుని లక్షణం

మహాభారత యుద్ధం తరువాత 42 సంవత్సరాలు గడచిపోయాయి. ఒకనాడు అర్జునుడు ద్వారకనుండి తిరిగి వస్తున్నాడు. ఎట్టి పరిస్థితిలో వస్తున్నాడు? అక్కడ యాదవకులంలో ముసలం పుట్టింది. యాదవులందరూ మరణించారు. కృష్ణుడుకూడా శరీరాన్ని వదలిపెట్టాడు. ఈ వార్తను తీసుకొని అర్జునుడు వస్తున్నాడు. అర్జునుని రాకను గమనించి కుంతీదేవి లేచి కూర్చుంది. ధర్మజుడు అర్జుననికి ఎదురేగి "అర్జునా! మన కృష్ణుడు ఎలా ఉన్నాడు? మన సఖుడు, మన బంధువు, మన బావ, మన దైవం కుశలమే కదా!" అన్నాడు. అర్జునుడు "ఇంకెక్కడ కృష్ణుడన్నా!" అని పట్టలేని దుఃఖంతో కూలబడ్డాడు. ధర్మజునిద్వారా ఈ వార్త విని కుంతీదేవి 'కృష్ణుడు పోయాడా!' అని మూడు పర్యాయములు పలికి ధర్మజుని తొడపై పడి ప్రాణం వదలింది. ధర్మజుడు తన తొడపై పడిన తల్లి దేహాన్ని చూసి "అమ్మా! కృష్ణుణ్ణి వెతుక్కోవటానికి నీవు వెళ్ళావా? నీవు కృష్ణుని వెతకటానికే వెళ్ళినట్లనిపిస్తోంది నాకు" అని చాల విచారించాడు.

"ఇంతకాలము మేము కృష్ణునివల్లనే జీవించాము, కృష్ణుని సహాయం వల్లనేయుద్ధంలో విజయం సాధించాము, పేరు ప్రతిష్ఠలను పొందాము. ఇంక, కృష్ణుడు లేని జీవితం మాకెందుకు?" అనుకొని వెంటనే భీమార్జున నకుల సహదేవులను పిలిచాడు. భీమునితో తల్లి అంత్యక్రియలకు తగిన ఏర్పాట్లు చేయమన్నాడు. అర్జుననితో పరీక్షిత్తు పట్టాభిషేకానికి కావలసిన ఏర్పాట్లు చేయమన్నాడు. నకుల, సహదేవులతో మహాప్రస్థానమునకు అంతా సిద్ధం గావించండి" అని చెప్పాడు. ఏమి విచిత్రము! కుంతీదేవి దేహానికి అంత్యక్రియలు, పరీక్షిత్తుకు పట్టాభిషేకము, పాండవుల మహాప్రస్థానం మూడు ఒక దినమే జరిగాయి. ఇలా ఎవరు చేయగలరు? భగవదనుగ్రహము కల్గిన ధర్మజునివంటి పరమ భక్తులకు మాత్రమే ఇది సాధ్యము. కష్టాలు కదలిపోయే మేఘాలవలె వస్తుంటాయి, పోతుంటాయి. కష్టానికి కంటినీరు పెట్టకూడదు,

sri sathyasai vachanamrutam

సుఖానికి పొంగిపోకూడదు. క్రుంగని, పొంగని మనస్తత్త్వాన్ని అభివృద్ధి పర్చుకోవాలి. ఇదియే నిజమైన భక్తుని దీక్ష. భక్తి అంటే ఏమనుకున్నారు? పూజలు, వ్రతములు చేయటం కాదు. భగవంతునిపై ప్రసరించిన ప్రేమను తిరిగి వెనుకకు తీసుకోకూడదు. అదియే నిజమైన భక్తి.

**లక్ష్మణ శరణాగతి**

లక్ష్మణుడు సీతారాముల వెంట అరణ్యానికి బయలుదేరాడు. ముగ్గురూ చిత్రకూట పర్వతం చేరుకున్నారు. ఆ ప్రదేశాన్ని చూసి రాముడు, "లక్ష్మణా! చాల ప్రశాంతమైన ప్రదేశానికి వచ్చాము. ఎండకన్నెరుగని సీత బాగా అలసిపోయింది. కాబట్టి ఇక్కడ మనం నివసించటానికి ఒక పర్ణశాల నిర్మించు" అన్నాడు. "ఎక్కడ నిర్మించాలి అన్నా!" అని అడిగాడు లక్ష్మణుడు. రాముడు "నీకు ఎక్కడ ఇష్టమో అక్కడ నిర్మించు" అన్నాడు. రాముని మాటలు లక్ష్మణునికి చాల బాధ కలిగించాయి. "అబ్బా, నేనెంతటి పాపం చేశానో కదా ఇలాంటి కఠినమైన మాటలు వినవలసివచ్చింది" అని దుఃఖించాడు. అప్పుడు సీతమ్మవారు "లక్ష్మణా! మీ అన్నగారు నిన్ను తిట్టలేదు, కొట్టలేదు కదా! ఎందుకు నీవింత దుఃఖిస్తున్నావు?" అని ప్రశ్నించింది. లక్ష్మణుడు "తల్లీ! రాముడు నన్ను తిట్టినా, కొట్టినా నాకు సంతోషమే. కాని, నా ఇష్టమనేది ఒకటి ప్రత్యేకంగా ఉందన్నాడు. ఆ మాట నా హృదయాన్ని కత్తులతో పొడిచినంతగా బాధించింది. రాముని ఇష్టమే నా ఇష్టము కదా! నేనేమి పాపం చేశానని నా ఇష్టం వచ్చినచోట నిర్మించమంటున్నాడు" అన్నాడు. అప్పుడు రాముడు లక్ష్మణునికి ఒక ప్రదేశాన్ని చూపించి "నాయనా! అక్కడ నిర్మించు" అన్నాడు.

శరణాగతి అనగా ఏమిటి? మీ సంకల్పము, దైవ సంకల్పము ఒక్కటిగానే ఉండాలి. ఏది జరిగినా అది భగవత్సంకల్పమే అని భావించాలి. ఇది మంచి, ఇది చెడ్డ, ఇది కష్టము, ఇది సుఖము అనే చర్చకు ఏమాత్రము అవకాశమివ్వకూడదు. దేవుడు ఏది చేయమంటే అది మీరు చేయవలసిందే! ఎందుకు, ఏమిటి అని ప్రశ్నించకూడదు. అదియే నిజమైన భక్తుని లక్షణం. దేవుడు ఏది చేసినా మీమంచి కోసమే! పాండవులకు అనేక కష్టాలు పెట్టాడు. అయితే కష్టాలవల్లనే వారి కీర్తి జగద్వ్యాప్తి అయింది. వారు అచంచలమైన భక్తితో దైవాజ్ఞను శిరసావహించి కట్టకడపటికి విజయాన్ని సాధించారు. భక్తిప్రపత్తులతో జగత్తులో ఎలాంటి కార్యమునైనా సాధించటానికి వీలవుతుంది.

sri sathyasai vachanamrutam

భగవంతుని చేరికయే యోగము.

భోగాన్ని త్యజించాలి, యోగాన్ని ప్రేమించాలి. మీరు చేసే ఉద్యోగంలో కూడా యోగాన్ని అనుభవించాలి. యోగమనగా ఏమిటి? భగవంతునితో చేరికయే యోగము. భగవద్గీతను తెరిచినప్పుడు మీకు మొట్టమొదట కనిపించేది అర్జున విషాదయోగము. అయితే విషాదం కల్గిందని తాను విరమించుకున్నాడా! లేదే! కృష్ణ పరమాత్మునితో చేరి విజయాన్ని సాధించాడు.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయో ర్భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ

కమలాఫలముపైన చేదు చర్మం లేకుండా లోపల తీయని రసం ఉండటానికి వీలుకాదు కదా! అదేవిధంగా, మంచికి మొదట కష్టములే అడ్డు తగులుతుంటాయి. కాని ఆ కష్టములలో ఎంతో సుఖమున్నది. చెఱకును పిండి పిప్పి చేసినప్పుడే అందులోని తీయని రసం ప్రాప్తిస్తుంది. బంగారాన్ని సుందరమైన నగగా తయారుచేయాలంటే దానిని అగ్నిలో వేసి కాల్చాలి, సుత్తితో కొట్టాలి, కత్తిరించాలి. అదేవిధంగా మానవుడు శాంతి, సౌఖ్యములను అనుభవించాలంటే అనేక రకములైన బాధలను అనుభవించవలసి ఉంటుంది.

**ఇచ్చినవారికే పుచ్చుకునే అధికారం ఉంటుంది.**

భగవంతుణ్ణి "హిరణ్యగర్భాయ నమః" అన్నారు. హిరణ్యమనగా బంగారమని అర్థం. ఈ హిరణ్యగర్భుడు ప్రతి మానవునియందు ఉన్నాడు. అందుకోసమే నేను మిమ్మల్ని "బంగారూ!" అని పిలుస్తుంటాను. హిరణ్యగర్భుడైన భగవంతుణ్ణి మీ వశం చేసుకున్నప్పుడే మీరు సత్యము, ధర్మము, త్యాగము అనే నగలను తయారు చేసుకోవచ్చును. బంగారమే లేక నగలను చేయటానికి వీలుకాదు కదా! కనుక మొట్టమొదట భగవంతుడునే బంగారాన్ని మీవశం చేసుకోవటానికి ప్రయత్నించాలి. మీరు ప్రేమను పెంచుకున్నప్పుడే భగవంతుణ్ణి మీ వశం చేసుకోవచ్చును. మీరేదైనా షాపుకు వెళ్లినప్పుడు ఆ షాపు యజమానికి కనీసం పది రూపాయలైనా చెల్లించనిదే అతడు మీకొక చేతి రుమాలు కూడా ఇవ్వడు కదా! మీరు భగవంతునివద్దకు పోయి మోక్షము, శాంతి, సంతోషము కావాలంటున్నారు. కాని, మీరేమి ఇస్తున్నారు భగవంతునికి? ఇచ్చిన వారికే పుచ్చుకోవటానికి అధికారం ఉంటుంది. కనుక మొట్టమొదట మీరు ప్రేమను ఇచ్చుకోండి,

srisathyasaivachanamrutam

అప్పుడే మీరు శాంతిని పుచ్చుకోవచ్చు. మీరు ప్రేమను ఇవ్వకుండా "భగవంతుడా! నాకు అది ఇవ్వు, ఇది ఇవ్వు" అని అడిగితే, ఎలా ఇస్తాడు? మొట్టమొదట భగవంతుణ్ణి అడిగే అధికారాన్ని మీరు సంపాదించుకోవాలి. అది ప్రేమతో కూడిన సేవచేతనే లభ్యమౌతుందిగాని, ఇతర సాధనవల్ల లభ్యం కాదు.

## సూక్ష్మంలో మోక్షం

మానవుడు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములతో కూడినవాడు. దేహము అన్నమయ కోశము. ఇది స్థూలమైనది. ప్రాణమయ కోశము సూక్ష్మమైనది. దీనికంటే మరింత సూక్ష్మమైనది మనోమయ కోశము. మనోమయ కోశముకంటే సూక్ష్మమైనది విజ్ఞానమయ కోశము. విజ్ఞానమయ కోశముకంటే అత్యంత సూక్ష్మమైనది ఆనందమయ కోశము. కనుక మీకు ఆనందం లభ్యం కావాలంటే, స్థూలమైన అన్నమయ కోశమును, సూక్ష్మమైన ప్రాణమయ కోశమును, మరింత సూక్ష్మమైన మనోమయ, విజ్ఞానమయ కోశములను దాటాలి. దీనిని పురస్కరించుకొనియే వేదాంతులు "సూక్ష్మంలో మోక్షం" అన్నారు. అట్టి ఆనందమును మీరు అనుభవించాలంటే దైవనామాన్ని స్మరించాలి, దైవప్రేమను పొందాలి. నేను అప్పుడప్పుడు చెబుతుంటాను – 'పిబరే రామరసం అని". అది ఆనందరసము. ఆ రసమును మీరు గ్రోలాలి. చక్కెరతో నీటిని చేర్చినప్పుడు అది పానకమౌతుంది. అట్లే, దైవనామ స్మరణతో ప్రేమను కూర్చినప్పుడు అది అమృతమైపోతుంది. అట్టి ఆనందరసాన్ని, ప్రేమరసాన్ని మీరు అనుభవించాలి, ఇతరులతో పంచుకోవాలి.

## ఆజ్ఞను అనుసరించినప్పుడే అనుగ్రహం లభిస్తుంది

"స్వామి మాతో ఎందుకు మాట్లాడటం లేదు?" అని మీలో చాలమంది అనుకుంటూంటారు. కాని "స్వామి చెప్పినట్లుగా నేను నడుచుకుంటున్నా, లేదా" అని మీరు విచారణ చేయటం లేదు. నాకుకూడా కొన్ని నిబంధనలున్నాయి. మీరు కోరినది నేను ఇచ్చినప్పుడు, నేను చెప్పినట్లు మీరు చేయాలి కదా! కాని మీరు చేస్తున్నారా? చేయటం లేదు. నా మాటలకు, నా ఆజ్ఞకు విలువ ఉన్నది. నామాటకు విలువ తగ్గించుకోవటం నాకిష్టం ఉండదు. నా ఆజ్ఞకు మీరు విలువ ఇవ్వనప్పుడు మీ ఇష్టాన్ని నేను ఏరీతిగా అంగీకరించగలను? భగవంతునికి క్రోధము గాని, ద్వేషముగాని లేవు. కాని మీ 'యాక్షన్'

sri sathyasai vachanamrutam

ఎలా ఉంటుందో భగవంతుని 'రియాక్షన్' కూడా అట్లే ఉంటుంది. కనుక మీరు మంచిగా ఉంటే మీకు వచ్చే ఫలితం మంచిగానే ఉంటుంది. మిమ్మల్ని మంచి మార్గంలో నడిపించే నిమిత్తమే నేను అప్పుడప్పుడు కోపం నటిస్తుంటాను. కాని ఈ సత్యాన్ని మీరు గుర్తించకుండా "స్వామి మాతో మాట్లాడటం లేదు, మమ్మల్ని చూడటం లేదు" అని అనుకుంటున్నారు. మీరు స్వామిని ఎంతవరకు మనస్సులో పెట్టుకున్నారు? స్వామి ఇచ్చిన అవకాశాన్ని మీరు ఏరీతిగా ఉపయోగపెడుతున్నారు? అది కూడ నేను చూస్తుంటాను. ఒక భిక్షగాడు ఇంటిముందుకు వచ్చి "అమ్మా ! ఆకలి" అని అడిగినప్పుడు ఆగృహలక్ష్మి తాను తినటం కూడా మాని వానికి వడ్డిస్తుంది. కాని ఆమె కంటి ముందే వాడు ఆ అన్నాన్ని అటూ ఇటూ పారవేస్తూ పోతే, రెండవ పర్యాయము వాడు మళ్లీ ఇంటి ముందుకు వచ్చినప్పుడు ఆమె వానికి అన్నం పెడుతుందా? "నేను పెట్టిన అన్నాన్ని దుర్వినియోగం చేస్తున్నావు. మళ్ళీ నీకు అన్నం పెట్టను, ఫో" అంటుంది. స్వామి కూడా అంతే! స్వామి ఇచ్చిన అవకాశాన్ని మీరు సద్వినియోగపర్చుకున్నప్పుడు స్వామి మిమ్మల్ని ఎంతైనా అనుగ్రహిస్తాడు. అట్లుగాక, ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకుని, మళ్లీ కావాలని ఆశిస్తే లాభం లేదు. భగవంతుడు భక్తప్రియుడే గాని, అంత సులభంగా చిక్కడు. ఒక్క ప్రేమకు మాత్రమే చిక్కుతాడు, దక్కుతాడు.

**దుర్భావాలను వీడండి, సద్భావాలతో నింపుతాను**

ప్రేమస్వరూపులారా! అందరికీ భక్తి ప్రపత్తులున్నాయి. అందరూ మంచివారే! కాని, కొంతమందికి ఏవిధంగా నడుచుకోవాలో తెలియటంలేదు. కొంతమంది తెలిసికూడా సరియైన మార్గంలో నడుచుకోవటం లేదు. ప్రాకృతమైన వాంఛలను అమితంగా పెంచుకోవటంచేత దైవానుగ్రహంపట్ల వాంఛ తరిగిపోతున్నాది. భగవత్తత్వాన్ని మీరు గుర్తించాలనుకుంటే మొట్టమొదట మీలోని దోషాలను నిర్మూలించుకోండి. మీ హృదయమనే పాత్రలో దుర్భావాలను నింపుకొని "స్వామీ! నీ అనుగ్రహమును, ప్రేమను నాలో నింపు" అంటే, ఎలా వీలవుతుంది? మొట్టమొదట దుర్భావాలను త్యజించి మీ హృదయపాత్రను ఖాళీగా ఉంచండి. అప్పుడే అందులో ప్రేమను నింపడానికి వీలవుతుంది.

ఏమీ లేని బుర్రలోన ఏమైనను చేర్చవచ్చు
ఏమేమో నిండియున్న బుర్ర నింప వీలుకాదు

sri sathyasai vachanamrutam

కలిబోధలు నిండియున్న తలబుర్రలు ఖాళియగునా
తలబుర్రది ఖాళిగాక ఇల సుకృతం నింపనగునా

మొట్టమొదట దుర్భావాలను త్యజించండి, మీ బుర్రను ఖాళి చేసుకోండి; నేను తప్పక సద్భావాలతో నింపుతాను. దానికి తగిన కాలాన్ని ఇస్తున్నాను. దానికి నేను కాచుకొని ఉన్నాను. నేను ఎప్పుడూ సిద్ధమే, సిద్ధమే! ఎవరికైనా సులభంగా లభ్యమౌతాను. ఎట్లా? మీ హృదయమనే పాత్రను పరిశుద్ధపర్చుకోండి. అప్పుడే దానిలో ఏమైనా నింపటానికి వీలవుతుంది.

మన పిల్లల స్పోర్ట్స్ కార్యక్రమాలు అత్యంత అద్భుతంగా జరిగాయి. మొట్టమొదట ఇన్‌స్టిట్యూట్ పిల్లలు ఆకువేసి రకరకములైన ఆటలనే వంటకాలను వడ్డించారు. ఆ వంటలు చెదిరిపోకుండా మన ప్రైమరీ స్కూల్ పిల్లలు వచ్చి ప్రేమ అనే మూతతో మూశారు. కనుకనే ఈ స్పోర్ట్స్‌మీట్‌యొక్క ఆనందము ఎప్పటికీ మరువటానికి వీల్లేకుండా ఉంది. ప్రైమరీస్కూల్ పిల్లలు చాల గుణవంతులు. చిన్న వయస్సు కావటంచేత వారికి ప్రాపంచిక సంబంధమైన వాసనలు ఏ మాత్రము లేవు.

## పుత్రులకు మదాలస జ్ఞానబోధ

మదాలస అనే రాణి తన పిల్లలను తొట్టెలో వేసి వారికి జ్ఞానాన్ని బోధించే పాటలు పాడుతూ జోకొట్టేది. "నాయనా! నీవు శుద్ధుడవు, బుద్ధుడవు, నిరంజనుడవు. సంసారమనెడి స్వప్నమును, మోహనిద్రను త్యజించు" అని వారికి బోధించి అరణ్యానికి పంపింది. పుట్టిన పిల్లలందరికీ జ్ఞాన బోధలు సల్పి వారిని అరణ్యానికి పంపితే, ఇంక రాజ్యమేలేది ఎవరు? అని ఒకనాడు భర్త కోప్పడ్డాడు. అప్పుడామె "మహారాజా! రాజ్యభోగము అనిత్యమైనది. కనుకనే నా కుమారులను నిత్య, సత్యమైన హృదయసామ్రాజ్యానికి రాజులుగా పట్టాభిషేకం చేస్తున్నాను" అని జవాబు చెప్పింది. స్వప్నం రావటానికి కారణం ఏమిటి? మీరు భుజించిన ఆహారం కాదు, మీరు విన్న విషయములు కాదు. స్వప్నానికి మూలకారణం నిద్రయే. నిద్రయే లేకపోతే స్వప్నమే లేదు. అదేవిధంగా మోహమనే నిద్రవల్లనే సంసారమనే స్వప్నం వస్తున్నది. కనుకనే మదాలస తన పుత్రులకు "సంసార స్వప్నా త్యజ మోహనిద్రాం" అని బోధించింది.

## దైవంపై నిందలు వేయుటం పరమ అజ్ఞానం

పుట్టినప్పుడు ప్రతిమానవుడు పరమ శుద్ధుడే, పరమ పవిత్రుడే! కాని, ఈ కలిప్రభావంచేత

sri satyasai vachanamrutam

ఈనాడు చిన్నచిన్న పిల్లలకుకూడా సంసార సంసారవ్యామోహం అధికమైపోతున్నది. ఈ వ్యామోహంలో చిక్కుకున్న వానిని దైవముగాని, తల్లిదండ్రులుగాని ఎవ్వరూ రక్షించలేరు. సంసార వ్యామోహమనే నిద్రలో మునిగినవానికి దుష్టభావములనే స్వప్నములు రాకుండా పోవు. అలాంటి స్వప్నములో మునిగి తేలుతూ భగవంతుడు మాట్లాడించటం లేదంటే, ఎట్లా మాట్లాడిస్తాడు? మీరు సంసారంలో ప్రవేశించాలనుకుంటే సంతోషంగా ప్రవేశించండి, ఈ ప్రాపంచికమైన ఆనందాన్ని అనుభవించండి. తరువాత విరక్తిని పొంది దైవరక్తిని అభివృద్ధి పర్చుకోండి. అంతవరకు మీరు చేయవలసింది చేసే తీరాలి. అంతేగాని ఏరికోరి సంసారంలో ప్రవేశించి, తరువాత ఆ బాధలను భరించుకోలేక దైవాన్ని నిందించటం చాల పొరపాటు.

పాపంబౌ పని చేసి ఫల మాపద కలిగిన రోసీ
కాపాడవు నీవనుచు కీడు నాపై అల్లెదరోయి

ఇంతకంటే పరమ అజ్ఞానము మరొకటి లేదు. బాధలు కలుగకుండా ఉండాలంటే పాపపు పనులలో ప్రవేశించకుండా ఉండాలి; దైవత్వాన్ని, అనుభవించాలి. అయితే సంసారంలో కూడా దైవత్వం ఉన్నది. సర్వత్ర ఉండిన దైవం సంసారంలో ఎందుకు ఉండదు? కాని మీరు అనుభవించే కష్టాలకు దైవంపై నిందలు వేయకూడదు. మీ దోషములయొక్క ఫలితాలను మీరే అనుభవించాలి. దైవం దేనికీ అడ్డు రాదు. నిరపరాధియైన దైవాన్ని విమర్శించటం చాల పొరపాటు. అన్నీ దైవానికే వదలిపెట్టండి. సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థమని భావించండి. అప్పుడు మీరు కోరినవన్నీ మీ ప్రయత్నం లేకనే లభిస్తాయి.

ప్రేమస్వరూపులారా! మానవత్వం చాల పవిత్రమైనది, దివ్యమైనది. ఇది మీకు భగవంతుడు అనుగ్రహించిన వరప్రసాదం. దీనిని మీరు సక్రమ మైన మార్గంలో వినియోగించుకోండి. మిమ్మల్ని కన్న తల్లిదండ్రులను ఆనందపెట్టండి. వారిని మీరు సంతోషపెట్టకపోతే ఇంక స్వామి మీకు ఏరీతిగా ఆనందాన్ని అందించగలడు? మొట్టమొదట తల్లిదండ్రులను ప్రేమించండి, వారి ప్రేమకు పాత్రులు కండి. అప్పుడు నా ప్రేమ మీకు తప్పక చిక్కుతుంది, దక్కుతుంది.

**(14.1.2000 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam